సమాచారం

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం

- డిప్యూటీ స్పీకర్ పద్మారావు



మందులు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు

చిలకలగూడ : నిరుపేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించిన ఘనత సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈఎన్‌టీ వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ వైద్యరంగం ఎంతో అభివృద్ధి సాధించిందని, మంత్రి కేటీఆర్ సారథ్యంలో హైదరాబాద్ నగరం మెడికల్ హబ్‌గా మారిందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనేక మంది నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించామని, ఉచిత వైద్య శిబిరాలతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, విబ్సన్‌ఫార్మా ఎండీ సుంకు రామ్‌చందర్ పాల్గొన్నారు.

అవినాష్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సంస్కృతం విభాగంలో జంగం అవినాష్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.వి జయశ్రీ పర్యవేక్షణలో కంపారిటివ్ స్టడీ ఆఫ్ వేమన శతకం అండ్ వేమనగీత అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అవినాష్ బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

కంటి వెలుగు కేంద్రం మార్పు

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని బోయబస్తీలో కొనసాగుతున్న కంటి వెలుగు కేంద్రం సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ఈస్ట్ మారేడుపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగనున్నట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి సాయి శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని బీ–సెక్షన్, డీ–సెక్షన్, అంబేడ్కర్ నగర్, మారేడుపల్లి వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాల్లో ఎస్టీ, ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయాలని వీసీ ప్రొ.రవీందర్‌ను సంఘం అధ్యాపకులు కోరారు. ఆదివారం జరిగిన ఎస్సీ, ఎస్టీ అధ్యాపక సంఘం సర్వసభ్య సమావేశంలో వివిధ అంశాల పై చర్చించి పీహెచ్‌డీ ప్రవేశాలలో అర్హత మార్కులు తగ్గించి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయాలని, ఓయూలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని తీర్మానించారు.

రెవెన్యూ అధికారుల తీరు సరికాదు

లాలాపేట: ధృవీకరణ పత్రాల జారీలో మారెడుపల్లి రెవెన్యూ అధికారులు తీవ్ర జాప్యం చేస్తుండటంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు దళిత సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేకంగా ఎస్సీ కుల ధృవీకరణ పత్రాల జారీలో మారేడుపల్లి తహసీల్ అధికారుల తీరు రోజు రోజుకు విమర్శలకు తావిస్తోంది. పైరవీకారులతో వెళ్తేనే పని అవుతుందనే దుస్థితికి చేరిందని ఆరోపించారు. నేరుగా దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికెట్ జారీ కోసం విచారణ పేరుతో సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంటికి వచ్చి ఇంట్లో పూజ గది ఉందా..దేవుని ఫొటోలతో కేలండర్లు, బుక్స్ ఉన్నాయా అంటూ ఇళ్లంతా కలియతిరగడం కొంత ఇబ్బందిని కల్గిస్తోందని పలువురు బాధితులు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

5వ వార్డు టికెట్ ఉద్యమకారులకే ఇవ్వాలి

కంటోన్మెంట్: బీఆర్ఎస్‌లో ఉద్యమకారులకు అన్యాయం జరుగుతోందని ఆ పార్టీ ఐదో వార్డు అధ్యక్షుడు కిరణ్ ఆరోపించారు. ఆదివారం ఆయన పలువురు ఉద్యమకారులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు అన్యాయం జరుగుతుందన్నారు. పోలీసుల తూటాలకు ఎదురొడ్డి ఉద్యమంలో పాల్గొని, పార్టీ జెండా మోసిన కార్యకర్తలను విస్మరించడం తగదన్నారు. బోర్డు ఎన్నికల్లో ఈ సారి ఐదో వార్డు నుంచి తన కుటుంబ సభ్యులను పోటీలో నిలుపుతానని కిరణ్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగా మంత్రులు విజ్ఞప్తి చేసినా ఉపసంహరించుకునే ప్రసక్తి లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పెంట శ్రీహరి భాస్కర్ ముదిరాజ్ చొల్లేటి రమేష్, సానది శ్రీనివాస్, వినోద్ మహేష్ పాల్గొన్నారు.

పుస్తకాలతో కుస్తీ.. చల్లని నీడలో చదువులు!



- ఓయూ క్యాంపస్ అంతా పరీక్షల ఫీవర్
- వరుస పరీక్షలతో విద్యార్థుల్లో టెన్షన్
- ఉద్యోగం నీకా.. నాకా అంటూ పుస్తక పఠనం



యూనివర్సిటీ లైబ్రరీలో చదువులో నిమగ్నమైన విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ ఏడాదంతా వరుస పరీక్షలతో ఓయూ విద్యార్థులు టెన్షన్ పడుతున్నారు. యూనివర్సిటీలో ఎక్కడ చూసినా పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన వివిధ ఉద్యోగాల రాత పరీక్షలన్నీ ఈ ఏడాదిలో ఉండటంతో ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యోగాల భర్తీల ప్రకటన అనంతరం వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉద్యోగం నీకా..నాకా అని పోటీపడి చదువుతున్నారు. పోటీ పరీక్షలతో పాటు వివిధ కోర్సుల అకాడమీ సెమిస్టర్ పరీక్షలు, యూజీసీ నెట్, టీఎస్‌సెట్‌తో క్యాంపస్ అంతా పరీక్షల ఫీవర్ నెలకొంది. రాష్ట్ర అవతరణ అనంతరం తొలిసారి వివిధ ఉద్యోగాల ఖాళీ భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేయడంతో లక్షలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగ సాధనకు గట్టి పోటీ ఉండటంతో కొందరు సొంతగా చదువుతుండగా అనేక మంది ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. యూనివర్సిటీ లైబ్రరీ, ల్యాండ్ స్కేప్ గార్డెన్‌తో పాటు క్యాంపస్‌లో ఎక్కడ చూసినా విద్యార్థులు చదువుతున్న దృష్యాలే కనిపిస్తున్నాయి.

కిటకిటలాడుతున్న హాస్టల్స్.

ఓయూ క్యాంపస్ హాస్టల్స్ విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయి. ఉద్యోగాలకు పోటీ పడుతున్న నిరుద్యోగులు హాస్టల్స్‌లో బోర్డర్స్‌గా ఉంటున్న స్నేహితు లు, బంధువుల గదుల్లో వసతి పొందుతున్నారు. తాజాగా జరిగిన పీహెచ్‌డీ ఎంట్రన్స్ పరీక్షలో అర్హత సాధించి సీటు లభిస్తుందనే నమ్మకంతో ఉన్న అభ్య ర్థులు పరిశోధన హాస్టల్స్‌లో ముందుగానే తిష్ట వేశా రు. నిర్ణిత సంఖ్య కన్నా హాస్టల్స్‌లో అధికంగా ఉండటంతో అనేక సమస్యలు ఉన్నా విద్యార్థులు ఓపికతో సర్దుకుంటూ చదువులు సాగిస్తున్నారు. ఉద్యోగ పో టీ పరీక్షలు, పోలీసు ఉద్యోగాల పరీక్షల కారణంగా విద్యార్థులు, నిరుద్యోగులతో క్యాంపస్ నిండుగా ఉంది.

తిండికి తిప్పలు..

ఓయూలో చదువు కునేందుకు సౌకర్యాలు ఉన్నా.. తిండి తిప్పలు తప్పవు. ప్రస్తుతం చదివే విద్యార్థులకు హాస్టల్, భోజన వసతి ఉంటుంది. ఎక్స్‌బోర్డర్లు, రాబోవు విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఎక్కడో ఒక చోట వసతి ఉన్నా భోజనానికి ఇబ్బంది పడాల్సిందే. ఓయూలో చదివే విద్యార్థులు అధికంగా పేదలైనందున ఎక్కువ మంది వంట చేసుకుంటే మరి కొందరు యూనివర్సిటీ క్యాంటీన్లలో తింటున్నారు. ఉద్యోగాల కోసం తిండి, నిద్ర లేకుండా చదువుతున్న విద్యార్థులు విజయం సాధించాలని ఆశిద్దాం.

ఇందిరా పార్కులో గంధం చెట్ల నరికివేత





బన్సీలాల్‌పేట్: నగరంలోని సుప్రసిద్ధమైన ఇందిరాపార్కులో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 9 గంధం చెట్లను నరికి మొద్దులను ఎత్తుకెళ్లారు. సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా దొంగలు యథేచ్ఛగా లోపలికి ప్రవేశించి తమ పని పూర్తి చేసుకొని వెళ్లారు. ఆదివారం పార్కు ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో భాస్కర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు ముమ్మురం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు చెప్పారు. రాత్రి వేళల్లో సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం, పార్కు పరిసరాల్లో కంచె తీరుతెన్నులపై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దొంగలు ఎక్కడి నుంచి ఎలా ప్రవేశించారు, ఇన్ని చెట్లు నరుకుతుంటే సెక్యూరిటీ సిబ్బంది ఎందుకు అప్రమత్తం కాలేదు, ఇందులో సెక్యూరిటీ వైఫల్యం ఎమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సెక్యూరిటీ పనితీరుపై విమర్శల వెల్లువ..

ఇందిరా పార్కులో గంధం చెట్ల నరికివేతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఇంటి దొంగల పనా లేక, సెక్యూరిటీ వైఫల్యమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 9 చెట్లను నరుకుతుంటే ఏ మాత్రం శబ్దం రాలేదా, దొంగలు ఎటు వైపు నుంచి పార్కులోకి ప్రవేశించారు...ఇందులో సెక్యూరిటీ హస్తమేమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్కులోకి యథేచ్ఛగా వెళ్లి వాహనాల్లో గంధం మొద్దులను తరలించారంటే సిబ్బంది హస్తమైనా ఉండాలి లేక సెక్యూరిటీ వైఫల్యం ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

'తెలంగాణలో బీజేపీ విజయం ఖాయం'

చిలకలగూడ: రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధించడం ఖాయమని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్టుగూడ డివిజన్ విజయపురి కాలనీలో ఆదివారం శక్తి కేంద్రం ఇన్‌చార్జి విజయ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసాలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లేష్, నాగేందర రావు, పవన్‌కుమార్, శేఖర్, ఓంప్రకాశ్, రుషికేష్, శంకర్‌దాస్, నరేందర్, తులసీ, వీరన్న, నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట: శక్తి కేంద్రం ఇన్‌చార్జి గెల్లు ఉదయ్ యాదవ్ నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో బండపల్లి సతీష్, నాగేశ్వర్ రెడ్డి, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బాక్సింగ్ విజేతకు ఘన సన్మానం



దేవానంద్‌ను సన్మానిస్తున్న మారుతి వ్యాయామశాల నిర్వాహకులు


చిలకలగూడ : రాజస్థాన్ పోఖ్రాన్‌లో జరిగిన ఏషియన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన చిలకలగూడకు చెందిన బాక్సర్ దేవానంద్‌ను మైలార్‌గడ్డ మారుతి వ్యాయామశాల నిర్వాహకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. నిరుపేద కుటుంబానికి చెందిన దేవానంద్ ఎంతో కష్టపడి బంగారు పతకం సాధించి తెలంగాణ కీర్తిని దేశవ్యాప్తం చేశాడని కొనియాడారు. మారుతి వ్యాయామశాల స్థాపించి నేటికి 75 ఏళ్లు గడిచాయని, గతంలో వ్యాయామశాల సభ్యులు నాట్కో శ్రీనివాస్, శ్రీనాథ్, జలంధర్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, లంబుకుమార్ తదితరులు కుస్తీ పోటీల్లో జాతీయ, రాష్ట్రస్థాయిల్లో అనేక బహుమతులు గెలుచుకున్నారని, ఇప్పుడు అదే వ్యాయామశాలకు చెందిన దేవానంద్ ఏషియన్ బాక్సింగ్ ఛాంపియన్‌గా అవతరించి వర్ధమాన క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపాడని అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎంఎస్ కుమార్‌గౌడ్, జలంధర్‌రెడ్డి, బ్యాంకురమేష్, శ్రీనివాసగౌడ్, జాషువ, రవి, లంబుకుమార్, టీవీ శ్రీను, మురళీ పాల్గొన్నారు.

కొత్త హాస్టల్ భవనంలో పాత సమస్యలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో అమ్మాయిలకు కేటాయించిన సెంటినరి కొత్త హాస్టల్ భవనంలో పాత సమస్యలు వెంటాడుతున్నాయని ఎస్ఎఫ్ఐ నేతలు పేర్కొన్నారు. ఈ సమస్యలపై అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గదుల సమస్యతో పాటు 90 మందికి బెడ్స్‌లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బీజేపీలో ఇమడలేక పోతున్నారు

- తారస్థాయిలో అంతర్గత విభేదాలు
- చేరికలు తక్కువ జంప్‌లు ఎక్కువ
- తాజాగా ఈటల మిత్రుడు కేశవరెడ్డి రాజీనామా



కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో బీజేపీ అంతర్గత కుమ్ములాటలు పుట్టి ముంచేలా తయారయ్యాయి. నామినేటెడ్ సభ్యుడి నియామకంతో మొదలైన ఆధిపత్య పోరుతో పలువురు సీనియర్ నేతలు పార్టీకి దూరమవుతూ వస్తున్నారు. రెండేళ్లుగా పార్టీలో చేరికలకన్నా వీడుతున్న వారే ఎక్కువ అవుతున్నారు. ముఖ్యంగా బోర్డు రాజకీయాల్లో చక్రం తిప్పిన మాజీ బోర్డు సభ్యులు పార్టీ వీడుతూ ఉండటం చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరైన బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి బీజేపీకి రాజీనామా చేయడంతో కంటోన్మెంట్ బీజేపీ రాజకీయాల్లో భారీ కుదుపు మొదలైంది. రాష్ట్రస్థాయిలో కీలక నేతగా కొనసాగుతున్న ఈటల తన ప్రియ మిత్రుడికి పార్టీలో తగిన స్థానం కల్పించలేకపోవడం పలువురిని ఆలోచనలో పడేసింది.

గత ఎన్నికల లెక్కలు ఇలా..

బీజేపీ ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి పోటీ చేసిన బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షులు బంగారు లక్ష్మణ్ 24.5 శాతం ఓట్లు (14445) సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి ఎస్ఏ కృష్ణ విజయం సాధించగా, రెండో స్థానంలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి మచ్చేందర్ రావుకు సైతం కేవలం 16,808 ఓట్లు వచ్చాయి. 1985– 89 ఎన్నికల్లో మిత్ర పక్షం టీడీపీకి మద్దతుగా నిలవగా, 1994 ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థి హనుమంతరావుకు 12,646 ఓట్లు వచ్చాయి.మళ్లీ 2018లో మాత్రమే బీజేపీ అభ్యర్థి ఎన్. శ్రీగణేశ్ 15వేలకు పైగా ఓట్లు సాధించారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి రామచంద్రా రావుకు కంటోన్మెంట్‌లో 35వేలకు పైగా ఓట్లు సాధించి, కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్ రెడ్డిని మూడో స్థానంలోకి నెట్టేశారు. ఇక బోర్డు ఎన్నికల విషయానికొస్తే 1992లో పి. వెంకట్రావు, 2006లో లక్ష్మణ్‌లు బీజేపీ మద్దతుదారులుగా బోర్డులో అడుగుపెట్టారు.

గయారామ్‌లే ఎక్కువ..

పాతికేళ్లుగా కంటోన్మెంట్‌లో బీజేపీ పుంజుకోలేదు. అయితే 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అనూహ్యంగా బీజేపీలోకి వలసలు పెరిగాయి. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు వి.జైప్రకాశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్, టీఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఇటుక రాజు వంటి కీలక నేతలు బీజేపీలో చేరి టికెట్ ఆశించారు. వీరితో పాటు ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రబోధిని, జాజుల గౌరి, కపిల్ బరాబరి వంటి నేతలూ పోటీ పడినప్పటికీ, ఎన్. శ్రీగణేశ్‌కు కేటాయించారు. అయితే ఎన్నికలు ముగిసిన కొద్దిరోజుల్లోనే ఆయా నేతలు బీజేపీని వీడారు. మళ్లీ రెండేళ్ల క్రితం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జే. రామకృష్ణ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఈయనతో పాటే మరో మాజీ ఉపాధ్యక్షురాలు భాసుక నర్మద మల్లికార్జున్, కొన్ని నెలల అనంతరం మరో మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌లు బీజేపీలో చేరారు. ఇక ఈటల రాజేందర్‌తో పాటు మరో మాజీ ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి బీజేపీలో చేరడంతో ఒక్కసారిగా కంటోన్మెంట్ కమలం వికసించింది.

సయోధ్య కుదరక..

బోర్డు మాజీ ఉపాధ్యక్ష పదవి కోసం జంపన ప్రతాప్‌తో పాటు రామకృష్ణ పోటీ పడ్డారు. వీరిలో రామకృష్ణ అభ్యర్థిత్వానికే అధిష్టానం మొగ్గుచూడంతో ఏడాదిన్నర కాలంగా జంపన ప్రతాప్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. రామకృష్ణతో పొసగకపోవడంతో కంటోన్మెంట్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్రలోనూ పాల్గొనలేదు. ఇక కేశవరెడ్డి, రామకృష్ణల మధ్య రెండో వార్డులో వర్గపోరు తీవ్రస్థాయిలో సాగుతూ వచ్చింది. రామకృష్ణ అవినీతిపై ఏకంగా సీబీఐకి ఫిర్యాదు చేస్తానంటూ కేశవరెడ్డి ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ ప్రకటించారు. అయినప్పటికీ అధిష్టానం వీరి మధ్య సయోధ్య కుదర్చలేకపోయింది. ఈ నేపథ్యంలోనే తాజాగా కేశవరెడ్డి పార్టీని వీడటంతో రామకృష్ణ వ్యవహార శైలి చర్చనీయాంశంగా మారింది.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సనత్‌నగర్ డివిజన్ దాసారం బస్తీలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కాకుండా ప్రజల ఆరోగ్య సంరక్షణ విషయంలోనూ ప్రభుత్వం శ్రద్ధ తీసుకుని బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తోందన్నారు. అంతేకాక అంధత్వరహిత తెలంగాణ లక్ష్యంగా రూ. 250 కోట్ల వ్యయంతో కంటి వెలుగు కార్యక్రమం చేపట్టి కంటి పరీక్షలు, అద్దాలు, మందులు ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. తాను వచ్చిన తర్వాత సనత్‌నగర్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని నూతనంగా రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, మంచినీటి వంటి అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశానన్నారు. దాసారం బస్తీలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పూర్తిస్థాయిలో తొలగించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక బస్తీ ప్రజల సౌకర్యార్థం మంజూరైన బస్తీ దవాఖానాను బస్తీవాసుల ఏకాభిప్రాయం తర్వాతనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జోనల్ కమిషనర్ రవికిరణ్, జిల్లా వైద్యాధికారి వెంకటి, ఏఎంఓహెచ్ భార్గవ్ నారాయణ్, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

మొబైల్ స్నాచింగ్

సనత్‌నగర్: నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థి చేతిలోని సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లిన సంఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ..అమీర్‌పేటలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న బ్రహ్మ గౌడ్ (24) సొంతూరు నంద్యాలకు వెళ్లి శనివారం రాత్రి తిరిగి వచ్చాడు. ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి జేబులోని మొబైల్‌ను లాక్కొని పరారయ్యారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో నుంచి పడి యువకుడి మృతి

అడ్డగుట్ట: రైలులో నుంచి జారీ పడిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేష్ వివరాల ప్రకారం.. ఈ నెల 26న చర్లపల్లి రైల్వే యార్డు వద్ద సికింద్రాబాద్ నుంచి కాజీపేట్ వైపు వెళ్లే డౌన్‌లైన్‌లో రైలులో నుంచి యువకుడు జారీ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుని జేబులో దొరికిన ఆధార్ కార్డును పరిశీలించగా బిహార్‌లోని గోసైన్‌పూర్‌కు చెందిన రాస్ బిహారీ చౌబే(23)గా గుర్తించారు.

ప్రజాదరణ ఉన్న నాయకుడు సాయన్న



సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జై ప్రకాష్, తదితరులు

రసూల్‌పురా: దివంగత ఎమ్మెల్యే సాయన్న ప్రజాదరణ ఉన్న నాయకుడని పలువురు కొనియాడారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జైప్రకాష్ ఆధ్వర్యంలో బొల్లారం సాధన మందిర్ వద్ద ఆదివారం సాయన్న సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జైప్రకాష్ మాట్లాడుతూ.. తాను బోర్డు ఉపాధ్యక్షుడిగా కొనసాగిన కాలంలో అడగగానే బొల్లారం ప్రాంత అభివృద్ధికి పవర్‌బోర్‌వెల్స్, కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేశారని నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే సాయన్న తపించేవారని గుర్తు చేశారు. సాయన్న కంటోన్మెంట్ ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. అజాత శత్రువుగా పేరొందిన సాయన్న పేద ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండేవారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్రావు, మనోజ్. జవహర్, ఇక్బాల్, శ్రీనివాస్ గౌడ్, ఉమేష్. ఉదయ్, సుభాష్‌రెడ్డి, బాలరాజు, దేవేందర్, మీరా, చిన్నా గబ్బార్ పాల్గొన్నారు.

ఉద్యానవనం.. పరిశుభ్రం

సాక్షి ఎఫెక్ట్..

బన్సీలాల్‌పేట్: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్కులు అధ్వానంగా మారి వినియోగంలోకి రాకుండా మారాయి. ఈ సమస్యపై 'నిర్వహణ భారమై.. పచ్చదనం కరువై' అనే శీర్షికతో ఈ నెల 21న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఉద్యానవన శాఖ అధికారులు స్పందించారు. పద్మారావునగర్, బోయిగూడ తదితర ప్రాంతాల్లోని పార్కుల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించారు. సదరు పార్కులు పరిశుభ్రంగా దర్శనమిస్తుండటంతో వాకర్స్, సందర్శకులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆ సందర్భంగా ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీదేవీ మాట్లాడుతూ.. పార్కుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పార్కులను పరిశుభ్రంతో పాటు పచ్చదనం వెల్లువిరిసేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.



పద్మారావునగర్ పార్కులో చెత్త తొలగించిన తర్వాత ఇలా..

ఆటో మీటర్ చార్జీలు పెంచాలి




మాట్లాడుతున్న వెంకటేశం

రాంగోపాల్‌పేట్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆటో మీటర్ చార్జీలను పెంచలేదని వెంటనే పెంచాలని ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ వెంకటేశం డిమాండ్ చేశారు. ఆదివారం రెతిఫైల్ బస్టాండు వద్ద ఏఐటీయూసీ ఆటో రిక్షా స్టాండ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2014 నుంచి ఇంధన, నిత్యావసర వస్తువుల ధరలు వందశాతం పెరిగాయని కానీ ఆటో డ్రైవర్ల బతుకులు మాత్రం మారలేదన్నారు. నేటి సమాజంలో అసలైన బాధితులు ఆటోడ్రైవర్లేనని చాలా మంది రుణాలు, అద్దెకు తీసుకుని నడిపిస్తున్నారని చెప్పారు. తక్కువ మీటర్ చార్జీలు ఉండటంతో ఇంధనం కొనుగోలు, రుణాలు చెల్లించడానికి వచ్చిన డబ్బు సరిపోతుందన్నారు. ప్రభుత్వం స్పందించి కనీసం కి.మీ.కు రూ.45 చార్జీని సవరించాలని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి వెల్ఫేర్ బోర్డు, హెల్త్ ఇన్సూరెన్స్, పీఎఫ్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఓమర్ ఖాన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు బాబు, ప్రధాన కార్యదర్శి ఆర్ మల్లేష్, నగర నాయకులు ఎస్‌కే లతీఫ్, హరిదర్శన్, ఆంజనేయులు రెతిఫైల్ స్టాండ్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యర్శులులు హన్మంతరావు, జితేందర్‌ను నియమించారు.

బోయిగూడలో ఘనంగా గ్యార్వీ

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయిగూడలోని రైల్ కళారంగ్ బస్తీలోని గౌస్‌–ఏ–పాక్ జిలానీ దర్గా 29వ వార్షికోత్సవాలు, గ్యార్వీ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దర్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో స్థానిక ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పదో నెంబర్ ప్లాట్ ఫారం వద్ద ఉన్న దర్గా నుంచి ఒంటెలపై చాదర్‌ను బ్యాండ్ మేళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్పొరేటర్ హేమలత, ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్, మహ్మద్ అస్లమ్, నాయకులు వెంకటేశన్, అల్తాఫ్, ముర్తుజా, అక్రమ్, అక్బర్ ఖాన్, గౌసియా బేగం, నాగలక్ష్మీ పాల్గొన్నారు.



గ్యార్వీ వేడుకలో పాల్గొన్న కార్పొరేటర్ హేమలత

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్ల వంకాయ 13, పొడుగు వంకాయ 18, బెండకాయ 50, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 15, దొండ 35, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 35, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 17, చామగడ్డ 70, మొరంగడ్డ 19, కందగడ్డ 30, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.